సువర్ణమూర్తులకు దర్బార్ సేవ

ముస్తాబైన స్వామి, అమ్మవార్లు

యాదగిరిగుట్ట, మార్చి16 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్బార్ సేవ వైభవంగా జరిగింది. శనివారం ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి సేవోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారికి పారాయణం చేసి స్వస్తి మంత్రార్థ పూజలతో శాంతిపజేశారు. నక్షత్రహారతి ఇచ్చి స్వామివారిని కొలిచారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు సువర్ణ పుష్పార్చనలు జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిగాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.24,22,074 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

ప్రసాదంలో ఎలుక కళేబరం అవాస్తవం

స్వామివారి పులిహోర ప్రసాదంలో ఎలుక కళేబరం అవాస్తవమని, ప్రసాద తయారీ కేంద్రంలోకి ఎలుకలు వచ్చే అవకాశమే లేదని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణి అన్నారు. శనివారం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆమె ప్రసాద తయారీ, వంటశాల, విక్రయశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ. పులిహోర ప్రసాదంలో ఎలుక వచ్చిందని కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన సమాచారంతో కమిషనర్ ఆదేశాల మేరకు విచారణకు వచ్చినట్లు తెలిపారు. ప్రసాదంలో ఎలుక వచ్చిందన్నది అవాస్తవమని కొట్టిపారేశారు. పులిహోర ప్యాకెట్‌లో ఎలుక ఉన్నట్టుగా ఎక్కడా కనిపించలేదన్నారు. ఆమె వెంట ఈఓ రామకృష్ణారావు, డీఈఓ భాస్కర్‌శర్మ, ఏఈఓ రామ్మోహన్, పర్యవేక్షకులు రాజన్ బాబు, అశోక్ ఉన్నారు.

లెఫ్టినెంట్ కర్నల్ వినయ్‌భానురెడ్డి సేవలు మరువలేనివి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

దివంగత లెఫ్టినెంట్ కర్నల్ వినయ్‌భానురెడ్డి కాంస్య విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, వినయ్‌భానురెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులు

బొమ్మలరామారం, మార్చి16 : గత సంవత్సరం విమాన ప్రమాదంలో మరణించిన లెఫ్టినెంట్ కర్నల్ వినయ్‌భానురెడ్డి దేశానికి చేసిన సేవలు మరువలేనివని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గుడిబావి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వినయ్‌భానురెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ రక్షణలో యువత ముందుండాలని అన్నారు. యువత వినయ్‌భానురెడ్డి ఆదర్శంగా తీసుకొని భారతసైన్యంలో చేరి రాష్ట్రానికి గుర్తింపు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పల నర్సింహారెడ్డి, రాంపల్లి మహేశ్, జూపల్లి భరత్, మోకు మధు, మైలారం ఈదమ్మ, గ్రామస్తులు, వినయ్ భానురెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అడ్డగూడూరు, మార్చి 16 : తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాల నుంచి మండలంలోని మానాయికుంట, అడ్డగూడూరు, చౌళ్లరామారం, జానకిపురం వరకు ఆర్‌అండ్‌బీ నిధుల నుంచి మంజూరైన రూ.25 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకుడు ఇటికాల చిరంజీవి, జిల్లా నాయకుడు పైళ్ల సోమిరెడ్డి, మండలాధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్, నాయకులు సత్యనారాయణ, రవీందర్, సోమిరెడ్డి, రాంరెడ్డి, మల్లేశ్, సైదులు, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌ను సమగ్ర అభివృద్ధి చేస్తాం

- మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్, మార్చి16 : చౌటుప్పల్‌ను సమగ్ర అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైపులైన్లు, వర్షాధార నీటి మళ్లింపు, పుట్‌పాత్‌ల నిర్మాణం కోసం సర్వే కొనసాగుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి, చౌటుప్పల్, లక్కారం చెరువులను ఆధునీకరిస్తున్నామని, వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని 16, 17, 18వ వార్డుల్లో సీసీ రోడ్డు, డ్రైనే జీ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. కౌన్సిలర్లు ఉబ్బు వరమ్మావెంకటయ్య, కాసర్ల మంజులాశ్రీనివాస్‌రెడ్డి, కొయ్యడ సైదులు గౌడ్, కాంశెట్టి శైలజాభాస్కర్, సందగళ్ల విజయాసతీశ్‌గౌడ్, పోలోజు వనజాఅనిల్, గోపగాని లక్ష్మణ్, కామిశెట్టి శైలజ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై నిరసనల వెల్లువ

- రోడ్లపై బైఠాయించిన బీఆర్ఎస్ శ్రేణులు
- ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మల దహనం

భువనగిరి అర్బన్ : ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా చేపట్టిన ధర్నాలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, పార్టీ నాయకులు


మోటకొండూర్ : ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

యాదగిరిగుట్ట, మార్చి16 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. ప్రధాన రహదారిపై ధర్నాలు చేపట్టి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకోలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతున్న సమయంలో ఎలా అరెస్టు చేస్తారని, కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో, రాజకీయ కుట్రలో భాగంగా కవితను అరెస్టు చేశారని మండిపడ్డారు. కవిత అరెస్టు ముమ్మాటికీ రాజకీయ కుట్రేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, మున్సిపల్ వైస్ చైర్మన్ కాటం రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి అంకం నర్సింహ, మాజీ సర్పంచ్ పల్లెపాటి బాలయ్య, నాయకులు మహేశ్, యాదగిరి, వెంకటేశ్, మల్లేశ్, సతీశ్, సత్యనారాయణ, సూర్యనారాయణ, నర్సింహ, బాలయ్య, లఖాన్ పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును ఖండిస్తున్నామని, బీజేపీ అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, ధర్నాలు, నిరసనలు తమకు కొత్తేమీ కాదని, బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ పిలుపుమేరకు శనివారం పట్టణంలోని బాబు జగ్జీవన్ రావ్ చౌరస్తాలో జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, రాష్ట్ర నాయకుడు సుదగాని హరిశంకర్ గౌడ్‌తో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తెలంగాణలో అధిక సీట్లు పొందేందుకు కవితను అక్రమంగా అరెస్టు చేయించిందన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, జడ్పీటీసీ బీరు మల్లయ్య, పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ విభాగాల నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, భగత్, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, పద్మ, మమత, శ్రీనివాస్, సుధాకర్, సుభాశ్, సూరజ్, అజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండల కేంద్రంలోని చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బీకూ నాయక్, ఎంపీపీ సుశీలారవీందర్, బీఆర్ఎస్ మండల సెక్రటరీ జనరల్ పరమేశ్, ఎంపీటీసీ కరుణాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బద్దూనాయక్, శ్రీకాంత్, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

మోటకొండూర్ : ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అప్రజాస్వామికమని మండల కో ఆప్షన్ సభ్యుడు బురాన్, బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జివిలికపల్లి వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్‌వై గ్రామశాఖ అధ్యక్షుడు బొట్ల మహేశ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రశాంత్, భాను, రుద్రబోయిన సిద్ధూ, బీరకాయల రాకేశ్, నవీన్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నరేంద్రమోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు సామల మల్లారెడ్డి, దేవరాయ కుమార్, కుడికాల అఖిలాబలరాం, నాయకులు శేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, బాలనర్సింహ, మాధవరెడ్డి, కాటంరాజు, కిరణ్, మల్లేశం, నర్సింహ, యాదగిరి, శ్రీకాంత్, ఉపేందర్‌రెడ్డి, శ్యామ్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తుర్కపల్లి : ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలి

- నోడల్ అధికారుల సమావేశంలో కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మార్చి 16 : ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే నోడల్ అధికారులను ఆదేశించారు. శనివారం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఆయన వివిధ విభాగాల నోడల్ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల నిబంధనలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్, ప్రైవేట్ స్థలాల్లో పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్స్ తొలగించాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని, సీ విజిల్ యాప్ ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఎంసీసీ టీములు క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోం, నోడల్ అధికారులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ కుట్రపూరితం : ఎంపీటీసీ

ఆత్మకూరు(ఎం) : మాట్లాడుతున్న ఎంపీటీసీ కవిత

ఆత్మకూరు(ఎం), మార్చి 16 : తెలంగాణ సాధన కోసం ఉద్యమించిన ఉద్యమ నాయకురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ కుట్రపూరిత చర్యఅని, కవిత అరెస్టును ఖండిస్తున్నట్లు ఆత్మకూరు(ఎం) ఎంపీటీసీ యాస కవితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను అణిచివేయాలన్న దుర్బుద్ధితో ఈడీ దాడులు చేయిస్తుందని ఆరోపించారు. కవితకు మహిళలంతా అండగా నిలువాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షురాలు నాయిని శశికళ, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు సోలిపురం అరుణ, రైతుబంధు సమితి మాజీ డైరెక్టర్ బీసు ధనలక్ష్మి, లక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

నాంచారమ్మ జాతరను ప్రభుత్వం నిర్వహించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జండగేకు వినతి

కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతిపత్రం అందజేస్తున్న ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్

భూదాన్‌పోచంపల్లి, మార్చి 16 : మండలంలోని పిలాయిపల్లిలో మే 22, 23 తేదీల్లో నిర్వహించే ఎరుకల నాంచారమ్మ జాతరకు రూ.5 లక్షలు విడుదల చేసి ప్రభుత్వం జాతర నిర్వహించాలని ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కూతాడి సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ హనుమంతు కె.జెండగేను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామం చివరి నుంచి నాంచారమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని, జాతర నిర్వహించే మూడు రోజులకు గానూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాడి యాదగిరి, పిలాయిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కుతాటి యాదగిరి, గ్రామ కార్యదర్శి కూతాటి వెంకటేశ్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరు(ఎం) ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల కోసం హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఆత్మకూరు(ఎం), మార్చి 16 : పదో తరగతి పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రఘురాంరెడ్డి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ మహదేవరెడ్డి శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం హాల్‌టికెట్ నంబర్లు వేశారు. ఈ కేంద్రంలో 187 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

క్రికెట్ విజేత గజ్వేల్ జట్టు

తుర్కపల్లి, మార్చి16 : గొంగిడి మహేందర్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల ఫైనల్స్‌లో గజ్వేల్ 11స్టార్ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు గొంగిడి యువసేన మండలాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ తలారి శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్యా రవీందర్ రూ.లక్ష నగదుతోపాటు ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన శ్రీనివాసపురం జట్టుకు రూ.50వేల నగదుతోపాటు ట్రోఫీ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సురేశ్, బెస్ట్ బౌలర్‌గా రమేశ్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు బాబు, మల్లేశ్, జహంగీర్, వినోద్, నవీన్, గణేశ్ పాల్గొన్నారు.

భూ వివాదంలో అత్తపై కోడలి దాడి

- తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ అత్త మృతి

వలిగొండ, మార్చి16 : భూ వివాదంలో అత్తపై కోడలు దాడిచేసిన ఘటనలో తీవ్రంగా గాయపడిన అత్త చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని ఎం.తుర్కపల్లిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎం.తుర్కపల్లికి చెందిన బద్దం యాదమ్మ(70) తన పెద్దకోడలు బద్దం స్వరూప మంగళవారం భూమి విషయంలో గొడవపడ్డారు. ఈ క్రమంలో యాదమ్మపై కోడలు కర్రతో దాడి చేయగా తీవ్రంగా గాయపడింది. ఆమెను మోత్కూర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు మృతురాలి చిన్న కుమారుడు బద్దం మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్‌పై దాడి.. కేసు నమోదు

రామన్నపేట, మార్చి16 : విధుల్లో ఉన్న ఆర్టీసీ కండక్టర్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం నార్కట్‌పల్లి డిపోకు చెందిన బస్సు శుక్రవారం రాత్రి చౌటుప్పల్ నుంచి రామన్నపేటకు వస్తుండగా జై కేసారం వద్ద శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి బస్సు ఎక్కాడు. అంబబావిగూడెం వద్ద బస్సు ఆపే విషయంలో కండక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. శ్రీనివాస్‌రెడ్డి కండక్టర్‌పై చేయిచేసుకోవడంతో కుడి కన్ను కింద గాయమైంది. కండక్టర్ చిలుకల నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

వైభవంగా వెంకటేశ్వరుడి తిరుకల్యాణోత్సవం

- హాజరైన ప్రముఖ యాంకర్ సుమ

తిరుకల్యాణంలో మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 16 : మండలంలోని కనుముక్కులలో పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి తిరుకల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టువస్త్రాలతో ఉత్సవమూర్తులను అలంకరించి సంప్రదాయకంగా కల్యాణం నిర్వహించారు. ప్రముఖ సినీ నటి, యాంకర్ సుమ, బీఆర్ఎస్ యువ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి స్వామివారి కల్యాణానికి హాజరయ్యారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా యాంకర్ సుమ మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్, జడ్పీటీసీ కోట పుష్పలతామల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షురాలు బత్తుల మాధవీశ్రీశైలంగౌడ్, నాయకులు శేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, అభిలాశ్‌రెడ్డి, గొట్టం వెంకట్‌రెడ్డి, బాంధవరెడ్డి, అంజిరెడ్డి, సత్తిరెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

పెంచికల్‌పహాడ్ వెళ్లేందుకు అండర్ పాస్ ఏర్పాటు చేయాలి

అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, గ్రామస్తులు

భువనగిరి అర్బన్, మార్చి 16 : భువనగిరి నుంచి పెంచికల్‌పహాడ్‌కు వెళ్లే జాతీయ రహదారిలో అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ మాట్లాడుతూ.. ఈ రహదారి భువనగిరి, వలిగొండ, ఆత్మకూర్(ఎం) మండలాల్లోని గ్రామాలకు వెళ్లేందుకు వీలుగా ఉంటుందని, ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో ఇప్పటికే 45 మంది ప్రయాణికులు మృతి చెందారని, వెంటనే ఈ మార్గంలో అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ వ్యవసాయానికి ప్రాధన్యమివ్వాలి

- జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ

సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ అనూరాధ

బొమ్మలరామారం, మార్చి16 : ప్రకృతికి మేలు చేసే సేంద్రియ వ్యవసాయానికి రైతులు ప్రాధన్యమివ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.అనూరాధ అన్నారు. మండలంలోని మల్యాల రైతు వేదికలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొని మాట్లాడారు. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు పెట్టుబడి వ్యయం తగ్గించవచ్చన్నారు. శిక్షణలో ప్రతిభ కనపర్చిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తే నగదు బహుమతులు

- మాజీ సర్పంచ్ ఉప్పలయ్య

ఆత్మకూరు(ఎం), మార్చి 16 : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు అందజేయనున్నట్లు కూరెళ్ల మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు బాషబోయిన ఉప్పలయ్య తెలిపారు. శనివారం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఫైల్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎస్ఎంసీ ఎరుకల స్వామిగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : మండలంలోని కొల్లూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గ్రామ కారోబార్ గ్యాదపాక రమేశ్ శనివారం పరీక్ష ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.